





ప్రథమ బహుమతి అందజేస్తున్న విజయలక్ష్మి

ఇలలో.. హరివిల్లు

ముత్యాల ముగ్గులతో పోటీపడ్డ మహిళామణులు

సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చేసినట్టుంది: వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్యే



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



అనంతపురం కల్చరల్, జనవరి 7: అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణం ఆదివారం ముత్యాలముగ్గులతో మురిసిపోయింది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన'కు విశేష స్పందన లభించింది. రెండు దశాబ్దాలకు పైగా ఆంధ్రజ్యోతి ఏటా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ సంక్రాంతి సంబరాలను గుర్తుచేస్తోంది. మహిళల్లో దాగున్న కళానైపుణ్యాలను ఈ పోటీల ద్వారా వెలికితీసి, ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విరివిగా హాజరయ్యారు. దాదాపు 162 మంది మహిళలు, యువతులు పోటీల్లో పాల్గొని, రకరకాల రంగవల్లులతో పోటీపడ్డారు. ఓవైపు మహిళలు ముగ్గులు వేస్తుండగా.. మరోవైపు చిన్నారులు పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో అలరించారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే..



ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక సృజనాత్మకత ఉంటుంది. తెలుగు సంస్కృతీసంప్రదాయాల్లో ముగ్గులు కూడా భాగం. మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీసి, ప్రోత్సహించేలా ఇలాంటి పోటీలు నిర్వహించడం శుభపరిణామం. పండుగ వాతావరణాన్ని అందరికీ స్మరింపజేసేలా ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో మహిళలతోపాటు నేటితరం యువతులు కూడా పాల్గొనడం ఆనందదాయకం.

- సావిత్రి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి

ముగ్గులతో ఆర్గాన్ డొనేషన్‌పై ప్రచారం

ఆపత్కాలంలో ఉన్నవారికి ఆర్గాన్ డొనేషన్ ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే సత్సంకల్పంతో ఆర్గాన్ డొనేషన్ ప్రాధాన్యతపై చైతన్యవంతులైన ముగ్గురు యువతులు ప్రచారం కల్పిస్తున్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన లక్ష్మీప్రసన్న, ధర్మవరానికి చెందిన సంధ్య, గడేకల్లు గ్రామానికి చెందిన కావేరి అనంతపురం నగరంలో హాస్టల్‌లో ఉంటూ డీఎస్సీకి శిక్షణ పొందుతున్నారు. మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన ఈ యువతులు తమ తోటి వారి కుటుంబాల్లో అనారోగ్యంతో బాధించబడ్డవారిని చూశారు. ఇదే క్రమంలో సోషల్ మీడియా ద్వారా ఆర్గాన్ డొనేషన్ గురించి తెలుసుకున్న వీరు ప్రతి ఒక్కరికీ దీనిపై అవగాహన కల్పించాలని సంకల్పించుకున్నారు. దీంతో తమకు తెలిసినవారందరికీ ఈ విధానంపై తెలియబరుస్తూ వస్తున్నారు. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ నడుస్తుండడంతో అక్కడక్కడ జరిగే ముగ్గుల పోటీల్లో వీరు పాల్గొంటూ ఆర్గాన్ డొనేషన్ గురించి ముగ్గుల రూపంలోనూ ప్రదర్శిస్తూ సాగుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో వీరు ఆర్గాన్ డొనేషన్ ముగ్గును వేశారు. ఆర్గాన్ డొనేషన్ సంస్థను స్థాపించడమే తమ లక్ష్యమని సదరు యువతులు పేర్కొంటున్నారు.





పోటీలకు జేవీవీ సమత కన్వీనర్, సీనియర్ వైద్యురాలు డాక్టర్ ప్రసూన, న్యాయవాది నాగేశ్వరి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీలకు ముఖ్య అతిథులుగా అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఆయన సతీమణి విజయలక్ష్మి, కోడలు హర్షిణి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ.. పట్టణాల్లో ఉండేవారేకాక.. పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చినవారు సైతం సంప్రదాయాలను మరిచే పరిస్థితి ఏర్పడిందన్నారు. అపార్ట్‌మెంట్ కల్చర్ వల్ల ముగ్గుల ఆవశ్యకత తగ్గిపోతోందనీ, భోగిమంటలు వేసేవారూ తక్కువయ్యారని అభిప్రాయపడ్డారు. ఇలాంటి తరుణంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వారు క్రమం తప్పకుండా ఏటీ ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందడి వాతావరణం చూస్తుంటే జిల్లాకు సంక్రాంతి పండుగ వారంరోజులు ముందుగానే వచ్చేసిందన్న భావన కలుగుతోందన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు, పాల్గొన్నవారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతపురంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన రమ్యకృష్ణకు మొదటి బహుమతిగా రూ.6వేలు, ఆరో రోడ్డుకు చెందిన స్వాతికి ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తాడిపత్రికి చెందిన సుజనారాణికి తృతీయ బహుమతిగా రూ.3వేలు నగదు బహుమతులను ముఖ్యఅతిథుల చేతులమీదుగా అందజేశారు. పోటీల్లో పాల్గొన్నవారందరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బీఎం గోపాల్ నాయుడు, ఏడీవీటీ మేనేజర్ మారుతిప్రసాద్, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్చార్జి వెలుగు రామకృష్ణుడు, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ సురేష్, ఏసీఎం నారాయణస్వామి నాయక్, ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సిబ్బంది పాల్గొన్నారు.



సత్సంబంధాలు నెలకొల్పడమే సారాంశం

ఉరుకులు పరుగుల జీవితంలో మహిళలకు మానసికోల్లాసం కలిగించేందుకు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఇలాంటి ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం. ముగ్గుల పోటీల నిర్వహణ అనేది కేవలం పోటీ కాదు, పోటీల్లో పాల్గొన్నవారి మధ్య సత్సంబంధాలు నెలకొల్పడమే అందులోని సారాంశం.



- డాక్టర్ ప్రసూన, జేవీవీ సమత కన్వీనర్



11 ఏళ్లుగా పోటీల్లో పాల్గొంటున్నా

11 ఏళ్లుగా జిల్లాలో ఎక్కడ ముగ్గుల పోటీలు జరిగినా పాల్గొంటున్నా. గతంలోనూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచి, బహుమతులు అందుకున్నా. ఈసారి మొదటి స్థానం దక్కింది. భవిష్యత్తులోనూ పోటీల్లో పాల్గొనడంతోపాటు ముగ్గుల ప్రాశస్త్యం, సంక్రాంతి విశిష్టతపై తోటివారందరికీ తెలియజేస్తా.

- రమ్యకృష్ణ, మొదటి బహుమతి



ముగ్గులే నా ప్రవృత్తిగా మారాయి..

నా చిన్నపుడు తోటివారితో కలిసి ఏదో కాలక్షేపానికి ముగ్గులపోటీల్లో పాల్గొనేదానిని. ముగ్గుల సంప్రదాయం వెనుకగల అంతర్యం తెలుసుకోవడంతోపాటు, పలు పోటీల్లో బహుమతులు రావడం ముగ్గులపట్ల ఆసక్తిని పెంచాయి. అప్పటినుంచి ముగ్గులనే ప్రవృత్తిగా మలుచుకున్నా. సంక్రాంతి సీజన్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటా. ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గుల పోటీల్లో ఏటా ఏదో ఒక బహుమతిని గెలుస్తున్నా.

- స్వాతి, ద్వితీయ బహుమతి



మొదటి బహుమతి కోసం ప్రయత్నిస్తా

12 సంవత్సరాలుగా తాడిపత్రిలో ముగ్గులపోటీల్లో పాల్గొంటూ వస్తున్నా. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొనాలనే ఉద్దేశంతోనే తొలిసారిగా అనంతపురం వచ్చా. పోటీల్లో తృతీయ బహుమతిని అందుకోవడం చాలా ఆనందంగా వుంది. వచ్చే ఏడాది మొదటి బహుమతి గెలిచేందుకు ప్రయత్నిస్తా.

- సుజనారాణి, తృతీయ బహుమతి



ముగింపు సభకు హాజరైన మహిళలు

సంస్కృతిని వ్యక్తపరిచేవి ముగ్గులు

సంస్కృతి, సంప్రదాయాలను సందర్భానుగుణంగా వ్యక్తపరిచేవి ముగ్గులు. పండుగలను బట్టి రకరకాల రూపాల్లో మహిళలు ముగ్గులను తీర్చిదిద్దుతుంటారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీతో అనంతపురానికి ముందుగానే పండుగ వాతావరణం వచ్చినట్లు కనిపిస్తోంది. విభిన్న రూపాల్లో మహిళలు తమలోని ప్రతిభను వ్యక్తపరిచారు.

- నాగేశ్వరి, న్యాయవాది

జనసేన, టీడీపీ గెలుపే లక్ష్యం

ఎన్నికల్లో బలిజలు పెద్దన్న పాత్ర పోషించాలి

జనసేన, టీడీపీ, కాపు సంక్షేమసేన, బలిజ సంఘం నేతల పిలుపు

బలిజల ఆత్మీయ కలయిక



జనసేన రాష్ట్ర నేతలతో టౌన్‌బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, టీడీపీ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7: ఎన్నికల్లో బలిజలు పెద్దన్న పాత్ర పోషించాలని జనసేన, టీడీపీ, కాపు సంక్షేమసేన, బలిజ సంఘం నేతలు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో కాపులంతా ఏకమై గళం వినిపించాలన్నారు. ఆదివారం స్థానిక గుత్తిరోడ్డులోని ద్వారకా చలమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో బలిజల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు, పొలిటికల్ ప్రొటోకాల్ చైర్మన్ తిరుమలరావు (బాబి), జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, జనసేన కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్ హాజరయ్యారు. జనసేన రాష్ట్ర నేత ఆమంచి స్వాములు మాట్లాడుతూ... రాబోవు ఎన్నికల్లో కాపులంతా ఏకతాటిపైకి వచ్చి చట్టసభల్లో కాపు గళం వినిపించేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాయలసీమలో అనేకమంది కాపులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వీరిలో రాజకీయ చైతన్యం తెచ్చేందుకు కాపు సంక్షేమసేన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మాట్లాడుతూ... జనసేన, టీడీపీ పొత్తును బలపరిచి రానున్న ఎన్నికల్లో ప్రజాప్రభుత్వాన్ని స్థాపిద్దామన్నారు. భవాని రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో విజయానికి జనసేన నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, కొత్త ప్రభుత్వాన్ని స్థాపించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న మాట్లాడుతూ కాపుల ఐక్యత కోసం నిరంతరం కాపు సంక్షేమసేన పనిచేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలకు కాపు సంక్షేమసేన సహకారం అందిస్తుందని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో కాపు సంక్షేమసేన జిల్లా అధ్యక్షుడు కాశెట్టి సంజీవరాయుడు, టౌన్‌బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, టీడీపీ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి, బలిజ సంఘం నాయకులు కూరగాయల లక్ష్మీపతి, టీడీపీ మాజీ జడ్పీటీసీ మేకల వేణుగోపాల్, టీడీపీ నాయకులు దండు శ్రీనివాసులు, కొప్పల మీనాక్షమ్మ స్వచ్ఛంద సంస్థ అధినేత రవికాంత్ రమణ, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు సుంకర రమేష్, రొళ్ల భాస్కర్, జనసేన నాయకులు గ్రంధి దివాకర్, పేరూరు శ్రీనివాసులు, వెన్నెల కృష్ణ, వెంకటనారాయణ, పత్తి చంద్రశేఖర్, ఆకుల ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరవుతున్న జనసేన భవానీ రవికుమార్, టీడీపీ నేతలు గాజుల ఆదెన్న, రాయల్ మురళి, దండు శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్

వెలవెలబోయిన బస్సుయాత్ర



జనం లేక ఖాళీగా ఉన్న సభాప్రాంగణం

ఉరవకొండ, జనవరి 7: పట్టణంలోని టవర్‌క్లాక్ కూడలిలో ఆదివారం వైసీపీ సాధికార బస్సుయాత్ర నిర్వహించారు. సమావేశంలో నేతల ప్రసంగాలు పారంభం కాగానే ప్రజలు వెనుదిరిగారు. ఈ యాత్రకు వైసీపీ నాయకులు ప్రైవేటు బస్సుల్లో ప్రజలను తరలించారు. సమావేశానికి మాజీ మంత్రి శంకరనారాయణ, ఎంపీ తలారి రంగయ్య, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కర్నూలు ఎమ్మెల్యే హాజరయ్యారు. సభ నాలుగున్నర గంటలకు ప్రారంభమైన కాసేపటికే జనం ఒక్కొక్కరూ వెళ్లిపోయారు. దీంతో సభ ఖాళీగా దర్శనమిచ్చింది. సమావేశానికి మంత్రులు ఎవరూ హాజరుకాకపోవడంతో కార్యకర్తలు నిరాశగా వెనుదిరిగిపోయారు. అంతకు మునుపు వీడియో తీస్తున్న ఓ వ్యక్తి ఫోన్‌ను లాక్కొని వీడియోలు డిలీట్ చేయాలని సూచించారు. ఇదే సమయంలో కవరేజీ చేస్తున్న మీడియా ప్రతినిధులపైన వైసీపీ నాయకులు దాడి చేశారు. అలాగే పట్టణంలోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వివిధ సామాజిక వర్గాల సమావేశంలో కూడా కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

వేతనాలు పెంచే వరకూ సమ్మె ఆపం

అంగన్‌వాడీల ఉద్ఘాటన

అనంతలో జీఓ 2 ప్రతులను దహనం చేస్తున్న నేతలు



అనంతపురం విద్య, జనవరి 7: ప్రభుత్వం వేతనాలు పెంచే వరకూ సమ్మె ఆపే ప్రసక్తే లేదని సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీల యూనియన్ నేతలు హెచ్చరించారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద 27వ రోజు కూడా అంగన్‌వాడీలు 24 గంటల రిలే దీక్షలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్, జీవో 2 ప్రతులను కలెక్టరేట్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు నాగమణి, ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్, సీపీఎం నగర కమిటీ కార్యదర్శి ఆర్వీ నాయుడు, జనసేన పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలతో చర్చించి న్యాయం చేయకుండా వారిపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అక్కచెల్లెమ్మలు అంటూనే.. సీఎం జగన్ వారి గొంతు నొక్కాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు. అత్యవసర సేవలు నిర్వహించే ఉద్యోగులపై విధించే ఎస్మా చట్టాన్ని అంగన్‌వాడీలపై విధించడం ఈ ప్రభుత్వ దౌర్జన్యకాండకు నిదర్శనమన్నారు. వెంటనే ఎస్మా ఎత్తివేయాలని, సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తలారి రామాంజనేయులు, ముత్తుజా, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతల, ప్రధానకార్యదర్శి రమాదేవి, జిల్లా కోశాధికారి జమున, ఇతర నేతలు అరుణ, రుక్మిణి, కాత్యాయని, ప్రభావతి, సరళ, వసంత, శ్రీదేవి, పద్మకుమారి, సూర్యకళ పాల్గొన్నారు.



దీక్ష చేపట్టిన అంగన్‌వాడీలు



విజేత అనంత స్పోర్ట్స్ అకాడమీ బాలికల జట్టు

ఫుట్‌బాల్ లీగ్ విజేత అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7: ఫుట్‌బాల్ లీగ్ పోటీల్లో అనంత స్పోర్ట్స్ అకాడమీ బాలికల జట్టు విజేతగా నిలిచింది. వారం రోజులుగా అనంత క్రీడాగ్రామం-ఆర్డీటీ, లాలిగ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాలికల ఫుట్‌బాల్-2024 లీగ్ పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో గుజరాత్ నాంది జట్టుపై 3పాయింట్ల తేడాతో అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు విజయం సాధించింది. ఎఫ్‌సీ (గోవా), లిబర్టీ లేడీస్ (తమిళనాడు), లైఫ్ స్పోర్ట్స్ (తమిళనాడు), గుజరాత్ స్పోర్ట్స్ స్కూల్, మహిళా జన్ అధికార సమితి (రాజస్థాన్), అనంతపురం (యునైటెడ్) జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గ్రామీణ ప్రాంతాల బాలికలను క్రీడల్లో ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు చేర్చడమే లక్ష్యంగా ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదేళ్లుగా లీగ్ నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. 8జట్లు, 144మంది క్రీడాకారులు లీగ్‌లో భాగస్వాములు అయ్యారన్నారు. అనంతరం ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోఆర్డినేటర్ దాదాఖలందర్‌ల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మెడికల్ రెప్స్ కార్యవర్గం ఎంపిక

అనంతపురం టౌన్ జనవరి 7: అనంత జిల్లా మెడికల్ రెప్స్, సేల్స్ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆదివారం జేవీవీ కార్యాలయంలో సమావేశమై ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమర్నాథ్, కార్యదర్శిగా విజయ్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, నరేంద్ర, సహాయ కార్యదర్శులుగా రామాంజినేయులు, నాగరంగయ్య ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షుడు రాజమోహన్ పాల్గొన్నారు.


ప్రచారం మిన్న.. ప్రవాహం సున్న


తూము వద్ద చుక్క నీరూ లేని దృశ్యం

- మిరప రైతును నిండా ముంచిన వైసీపీ నేతలు
- జీబీసీకి సాగు నీరు ఇస్తామన్నారు.. మొండిచేయి చూపారు
- నీరందక పంటను పొలాల్లోనే వదిలేసిన రైతులు
- లక్షల్లో నష్టపోయామని ఆవేదన

ఎండిపోయిన పిల్ల కాలువ

విడపనకల్లు జనవరి 7: హంద్రీనీవా కాలువ నుంచి జీబీసీలోకి సాగు నీరు మళ్లించాం.. రైతు కష్టాలు తీరినట్లే..బంగారం పండినట్లే అని వైసీపీ నాయకులు జోరుగా ప్రచారం చేశారు. పాపం రైతులు తమ పంట పండిందని సంబరపడ్డారు. కానీ ప్రచారం చేసినంత జోరుగా నీరు కాలువలో పారలేదు. జీబీసీ ప్రధాన కాలువ కింద వేల ఎకరాల్లో సాగు చేసిన మిరప రైతులు నష్టాలతో విలవిలాడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు జీబీసీకి పూర్తి స్థాయిలో సాగు నీరు ఇస్తామంటూ మిరప రైతులను పక్కా ప్లాన్ ప్రకారం నిట్ట నిలువునా మోసం చేశారు. నెల రోజులుగా సాగు నీరు కోసం ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది. హంద్రీనీవా కాలువ నుంచి జీబీసీలోకి సాగు నీరు మళ్లించామంటూ వైసీపీ నాయకులు భారీగా ప్రచారం నిర్వహించారు. కానీ ఇచ్చింది మాత్రం కాలువకు కేవలం 10.15 క్యూసెక్కుల నీరే.. ఈ నీరు జీరో బై జీరో నుంచి దాదాపుగా 35 కిలో మీటర్లు దూరం సాగాలి. కానీ కాలువలో పారుతున్నది అడుగు లోతు నీరు మాత్రమే. స్టార్టింగ్ పాయింట్ నుంచి మిరప రైతులు కాలువపై నీటి మోటార్లు ఏర్పాటు చేసుకుని పొలాలకు సాగు నీరు తోడుకుంటున్నారు దీంతో ఒక్క డిస్ట్రిబ్యూటరీకి నీరు పారలేదు. ప్రతీ ఆయకట్టు రైతు సాగు నీరు అందక ఏమి చేయాలో దిక్కు తోచక మిరప పొలాలను అలాగే వదిలేశారు. వైసీపీ నేతలు చేసిన మోసానికి నానా బూతులు తిట్టుకుంటూ, ఉసురు కొట్టుకు పోతారని శాపనార్థాలు పెడుతున్నారు. కనీసం 100 క్యూసెక్కుల నీరు జీబీసీకి ఇచ్చి ఉంటే ప్రతి రైతుకు వారం రోజులు సాగు నీరంది ఉండేది. అడుగెత్తు నీరు కూడా లేకపోవడంతో పంటలు పండక రైతు అప్పులపాలయ్యాడు. విధి లేక బళ్లారి జిల్లా నుంచి నీటి ట్యాంకర్లు తెప్పించి మిరప పంటకు తడి అందిస్తున్నారు. ఎకరాకు 10 ట్యాంకర్ల ప్రకారం వారానికి ఒక తడిగా రూ. 10వేలు ఖర్చు తప్పడం లేదు. పొలికి, గడేకల్లు, ఆర్ కొట్టాల, హావళిగి, విడపనకల్లు, వేల్పుమడుగు, జనార్ధన పల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు.


మిరపకు ట్యాంకర్ల ద్వారా నీరిస్తున్న రైతు

నిలువునా మోసం : సూరి, రైతు

15 ఎకరాలు కౌలుకు తీసుకొని 8 ఎకరాల్లో మిరప, 7 ఎకరాల్లో సీడ్ జొన్న సాగు చేశాను. పంటలు మంచి పట్టు మీద ఉన్న సమయంలో సాగు నీరు నిలిచిపోయింది. వైసీపీ నాయకులు జీబీసీ కాలువకు సాగు నీరు ఇస్తామంటూ కనీసం అడుగు ఎత్తుకూడా ఇవ్వకుండా చేసిన మోసం చేసిన పాపం ఊరికే పోదు.



ట్యాంకర్లే గతి : రామాంజనేయులు



నెల రోజులుగా సాగు నీటి కోసం ఎదురు చూసి చుక్క నీరు రాక పోవటంతో బళ్లారి నుంచి ట్రాక్టర్లను తెప్పించి, తడులు పెట్టుకుంటున్నాను. కనీసం ఓ నాలుగు ఎకరాల్లో పంటలను కాపాడుకున్నా అప్పులు ఊబి నుంచి బయట పడవచ్చు అనే చిన్న కోరికతో వేల రూపాయలు ఖర్చు పెట్టక తప్పడం లేదు.

లక్షల్లో నష్టం : హనుమంతు

దాదాపుగా 30 ఎకరాల్లో మిరప, 20 ఎకరాల్లో సీడ్ జొన్న పంటలను జీబీసీ కాలువ కింద సాగు చేశాను. సాగు నీరు వస్తుంది అని ఆశతో ఎదురు చూస్తున్న మాకు నిరాశే మిగిలింది. దాదాపుగా లక్షల్లో నష్టాలు పాలు అయ్యి అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాను. ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది. పెట్టుబడులు కూడా వచ్చేది కష్టమే.



పొలంలోనే వదిలేశా: నాగప్ప



ఆరు ఎకరాల్లో జీబీసీ కాలువ కింద ఎకరాకు రూ. 40 వేలు కౌలు చెల్లించి మిరప సాగు చేశాను. నెల రోజులుగా సాగు నీరు రాక పోవటంతో అలాగే వదిలేశాను. ఇప్పటికే రూ. 10లక్షలుకు పైగా అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాను. అధికార పార్టీ నాయకులు నిండా ముంచేశారు.

ముగిసిన బాలవికాస్ వేడుకలు


బహుమతులను ప్రదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

పుట్టపర్తి, జనవరి 7: బాలవికాస్ 'అల్యూమిని' వేడుకలు రెండవ రోజు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రశాంతినిలయంలోని సాయి కుల్వంత్‌లో మొదట విద్యార్థినులు, బ్యాస్‌బ్రాడ్‌తో భక్తులను అలరింపచేశారు. అనంతరం వ్యాసరచన పోటీల్లోఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ట్రస్టు సభ్యులు ఆర్‌జే రత్నాకర్, చక్రవర్తి బంగారు పథకాలతో సత్కరించారు. బాలవికాస్ విద్యార్థులు కొయ్యకాళ్లతో చేసిన నృత్యం భక్తులను అబ్బురపరిచింది. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షులు నిమిష్ పాండె, సేవాదల్ సభ్యులు పాల్గొన్నారు.


కొయ్యకాళ్లతో నృత్యం చేస్తున్న విద్యార్థులు

మోసం కేసులో మడకశిర ఎంఈఓ అరెస్టు

మడకశిరటౌన్, జనవరి 7: మోసానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై మడకశిర ఎంఈఓ శ్రీనివాసభాస్కర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తంబాళ్లపల్లి ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు 2021 సంవత్సరంలో సచివాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ నియామకపత్రాలతో నిరుద్యోగ యువతను ఎంఈఓ మోసం చేశారని తెలిపారు. సచివాలయంలో ఉద్యోగాల పేరుతో నకిలీ నియామక పత్రాలు సృష్టించి నిరుద్యోగ యువతకు ఇచ్చారని, ఆ పత్రాలతో విధుల్లో చేరడానికి అన్నమయ్య జిల్లా తంబాళ్లపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లగా నియామక పత్రాలను పరిశీలించిన ఎంపీడీఓ అనుమానం వచ్చి తంబాళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏ-3 నిందితుడిగా ఎంఈఓను చేర్చి, శనివారం అరెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు.

యా(బా)ప్‌రే...!

- ఓపీకి ఆయుష్మాన్ భారత్ లింక్
- 'యాప్'డౌన్‌లోడ్ చేసుకుంటేనే ఓపీ చీటీ
- ఆధార్ లేకపోతే అంతే గతి...
- జిల్లా ఆస్పత్రిలో వింత పరిస్థితి



అనంతపురం టౌన్ జనవరి7: అష్టకష్టాలు పడి, అనేక బాధలతో వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే వారికి సాంకేతిక కష్టాలు చుక్కలు చూపిస్తున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని జిల్లా ఆస్పత్రిలో అమలు చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఆయుష్మాన్‌భారత్ యాప్ ద్వారా ఆన్‌లైన్ సేవలు అందించడం దీని ప్రధాన ఉద్దేశం. మొదట చికిత్స కోసం వచ్చే రోగులందరికీ ఆయుష్మాన్ భారత్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటేనే ఓపీ చీటీ రాసి ఇస్తున్నారు. ఇదే పెద్ద సమస్యగా మారింది. ఆధార్ కార్డును ఆస్పత్రి సిబ్బందికి ఇస్తే వారు 'అయుష్మాన్‌భారత్' యాప్‌లో వివరాలు నమోదు చేసి ఓ నెంబర్ ఇస్తారు. ఆనెంబరును ఓపీ కౌంటర్‌లో చూపిస్తేనే ఓపీ చీటీ ఇవ్వడం జరుగుతుంది. ఇదంతా పూర్తి కావాలంటే దాదాపు అరగంటనుంచి గంట సమయం పడుతోంది. అత్యవసర పరిస్థితి ఉన్న వారికి ఇబ్బంది తలెత్తుతోంది.


జిల్లా ఆస్పత్రిలో యాప్ డౌన్‌లోడ్‌కోసం రోగుల అవస్థలు

● ఆధార్ లేకపోతే అంతేగతి..

జిల్లా ఆస్పత్రికి అధిక శాతం నిరుపేద రోగులే వస్తుంటారు. అధికారిక లెక్కల మేరకు ప్రతిరోజూ 1200 నుంచి 1800 మంది వరకు వస్తున్నారు. సోమవారం అయితే ఓపీ 2వేలు దాటిపోతోంది. వీరందరూ ఆయుష్మాన్ భారత్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొన్న తర్వాతే ఓపీ చీటీ ఇస్తున్నారు. కొద్ది మంది అవగాహన లేని వారు ఆధార్ లేకుండా వస్తుంటారు. వారికి ఓపీ టికెట్ ఇవ్వకుండా వెనక్కి పంపిస్తున్నారు. దీంతో ఆ రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోతోంది. ఇదిలా ఉంటే సీరియస్ కేసులు ఎమర్జెన్సీకి తీసుకొచ్చినా అక్కడ కూడా ఈయాప్ ద్వారా ఓపీ తీసుకొని వెళ్లిన తర్వాతే చికిత్సలు, అడ్మిషన్‌లు చేస్తున్నారు. అలాంటివారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది.

● కావాలనే సమస్య సృష్టిస్తున్నారు..
: డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్



'ఆయుష్మాన్ భారత్' యాప్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అమలు చేస్తున్నాం. అది మంచి కార్యక్రమం, అయితే అది ఖచ్చితం అని నిబంధన లేదు. ఆస్పత్రికి రోజుకు 1800 మంది వరకు వస్తున్నారు అందరూ ఆధార్ కార్డులతో రాలేరు కదా అలాంటివారికి కౌంటర్‌లో ఓపీ చీటీలు ఇస్తున్నాం. కొందరు కావాలనే సమస్య సృష్టిస్తున్నారు. దీనిపై ప్రత్యేకంగా ఆరాతీస్తా, రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

చేనేతను కాపాడుకోకపోతే ధర్మవరానికి మనుగడే లేదు

- మా ప్రభుత్వం వచ్చాక పాలిష్ కార్మికులను ఆదుకుంటాం
- పాదయాత్రలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


పరిటాల శ్రీరామ్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి

ధర్మవరం, జనవరి 7: గుండెలాంటి చేనేత పరిశ్రమను కాపాడుకోకపోతే ధర్మవరానికి మనుగడే ఉండదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. ధర్మవరం పట్టుచీరలంటే ప్రపంచంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, కానీ అది రోజురోజుకూ కనుమరుగవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు పాదయాత్ర నాల్గవ రోజు ఆదివారం పట్టణంలో పలు కాలనీల్లో ఆయన టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం నుంచి దిగువపేరి, బడేసాహేబ్‌వీధి, బోయవీధి,మార్కెట్‌వీధి, దర్గావీధి, లోనికోట, యాదవవీధి, వరలక్ష్మీథియేటర్ వరకు పాదయాత్ర సాగింది. అన్ని కాలనీల్లో ప్రజలు పరిటాల శ్రీరామ్‌కు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఓ వైపు 'బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే మరో వైపు ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. మార్గమధ్యలో చేనేత కార్మికులతో పరిటాలశ్రీరామ్ సమావేశమయ్యారు. ముడిసరుకుల ధరలు పెరిగిపోవడం వల్ల నేసినప్పటికీ గిట్టుబాటు ధరలేకుండా పోయిందని, కరోనా సమయం నుంచి కోలుకోలేకుండా నష్టపోతున్నామని, కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు పవర్‌లూమ్స్ రావడం వల్ల హ్యాండ్‌లూమ్ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. చేనేత పరిశ్రమను కాపాడాలంటే నేత కార్మికులకు తగిన ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తిచేశారు. స్పందించిన పరిటాలశ్రీరామ్ గత టీడీపీ హయాంలో చేనేతలకు అన్ని రకాల సబ్సిడీలు ఉండేవని, కానీ ఇప్పుడు ఎక్కడా అలాంటి పరిస్థితి కనిపించడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం చేనేత కార్మికులను మరింత కష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు. మరోవైపు పాలిష్ కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గతంలో లాభదాయకంగా ఉన్న ఈ వృత్తి ఇప్పుడు భారంగా మారుతోందన్నారు. చీరలకు వేసే గమ్ ధరలు విపరీతంగా పెరిగిపోవడమే కాకుండా జీఎస్టీ కూడా వేయడం పాలిష్ వృత్తిపై ఆధారపడిన వారు ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆరోగ్యశ్రీ కూడా కార్మికులకు వర్తించలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ వర్తింపచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీఎస్టీ అంశంపై కూడా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో ఉన్న సబ్సిడీలు ఎందుకు ఎత్తివేశారో వైసీపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.


సమస్యలపై స్థానికులతో ఆరా తీస్తున్న శ్రీరామ్

ధర్మవరం ప్రజలకు పరిటాల శ్రీరామ్ అండగా ఉంటారు: బీకే

పరిటాల శ్రీరామ్ చేపట్టిన పాదయాత్రలో సత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షుడు, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకేపార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేనేత కార్మికులకు మొదటి నుంచి అండగా ఉండేది టీడీపీనేన్నారు. ప్రస్తుతం టీడీపీ విజయం సాధించడం తమ పార్టీకి మాత్రమే కాకుండా ప్రజలకు కూడా చాలా అవసరమన్నారు. పరిటాలశ్రీరామ్ చేపట్టిన పాదయాత్రకు మంచి స్పందన వస్తోందని ఆయన అన్నారు. ధర్మవరం లాంటి ప్రాంతంలో అరాచకాలకు అడ్డుకట్ట వేసి ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే పరిటాలశ్రీరామమ్ లాంటి ధైర్యవంతులైన వ్యక్తి అవసరమన్నారు. శ్రీరామ్ ఎమ్మెల్యే అయిన తరువాత ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తారన్నారు. కల్లోలంగా మారిన ధర్మవరాన్ని శ్రీరామ్ ప్రశాంతంగా మారుస్తారన్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని ప్రజలంతా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

మితిమీరిన వైసీపీ గూండాల దౌర్జన్యాలు

- జయహో బీసీ సభలో మాజీ మంత్రి కాలవ విమర్శ


జయహో బీసీ రథాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, జనవరి 7: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అవినీతి, అసమర్థత వైసీపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గూండాల ఆగడాలు, దౌర్జన్యాలు రాజ్యమేలుతూ బీసీలను అణగదొక్కుతున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. ఆదివారం బొమ్మనహాళ్ మండలంలోని ఏళంజి, కానాపురం గ్రామాలలో జయహో బీసీ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుబ, గాండ్ల, వడ్డెర్ల, వాల్మీకి తదితర బీసీ సాధికారిక రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు కురుబ రమణ, ఆవుల క్రిష్ణయ్య, గాండ్ల విశాలాక్షి, ప్రతాప్‌నాయుడు, పోతులయ్య, వడ్డే వెంకట్, పోలన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పేరుతో దోపిడీ, అధికారాన్ని ఉపయోగించుకుని దౌర్జన్యాలతో రాజ్యమేలుతున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు పాలనలో జన్మభూమి కార్యక్రమం పెట్టి అధికారులను ప్రజల మధ్యలో తీసుకొచ్చి తాగునీటి సౌకర్యం, పెన్షన్, రేషన్‌కార్డులు ఇచ్చేవారమన్నారు. వైసీపీ పాలనలో కొత్తవి పెన్షన్ కంటే తొలగించినవే ఎక్కువ ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని కేంద్రం ఇచ్చే నిధులను కూడా మింగేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి అవినీతి, అసమర్థత పాలన ఎప్పుడూ చూడలేదని రాష్ట్రంలో 12 సార్లు కరెంటు బిల్లులు పెంచి, బస్సు చార్జీలు, గ్యాస్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచారన్నారు. బీసీలను రాష్ట్రంలో అణగదొక్కుతూ వందలాది మందిని పొట్టనపెట్టుకొని కేసులు మోపుతూ బీసీలకు రక్షణ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాచైతన్యమే లక్ష్యంగా టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాలవ అన్నారు. జయహో బీసీ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వకూటమిలో బీసీలకు చేయబోయే కార్యక్రమాలన్నింటిని అందిస్తామని అన్నారు. ఒక్క అవకాశం అంటూ తండ్రిలేని బిడ్డ అని తోడుగా ఉంటారని జగన్ మోహన్‌రెడ్డిని చూసి ఓట్లు వేశారని, కానీ ఈ రోజు అందరూ బాధపడుతున్నారని తెలిపారు. బూటకపు నాటకాలను నమ్మకండని బీసీ సాధికారిక నాయకులు అన్నారు. అభ్యర్థులను మార్చినంత మాత్రాన వారి స్వభావాలు మారుతాయా, అరాచక ప్రభుత్వాన్ని అంతమొందించాలన్నారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ, జనసేన మండల కన్వీనర్లు బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, హనుమంతు, శివరాజ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు యర్రగుంట్ల వెంకటేశులు, మాజీ కన్వీనర్ చలపతి, టీడీపీ సీనియర్ నాయకులు అప్పారావు, మాజీ డైరెక్టర్ మహేంద్ర, పయ్యావుల అనిల్, క్లస్టర్ కన్వీనర్ ధనుంజయ, పయ్యావుల మోహన్, కావలి రాము, కావలి ప్రభు, నవీన్, సైకిల్ షాప్ హనుమంతు, మండల మహిళా అధ్యక్షురాలు శ్యామల, జనసేన నాయకులు సికిందర్, లోకేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలు ఫుల్.. అభివృద్ధి నిల్..

- ధర్మవరాన్ని దౌర్జన్యాలకు కేంద్రంగా మార్చిన కేతిరెడ్డి : మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం, జనవరి 7: ధర్మవరం నియోజవకర్గంలో నాలుగున్నర ఏళ్ల కాలంలో అభివృద్ధి జరగకపోయినా భూ కబ్జాలు పెరిగిపోయాయని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో దౌర్జన్యాలు, రౌడీయిజం పెరిగిపోయాయని ప్రశాంతంగా ఉన్న ధర్మవరం నియోజకవర్గాన్ని అరాచకాలకు, దౌర్జన్యాలకు, అడ్డాగా మార్చిన ఘనత ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి చెల్లుతుందన్నారు. టీడీపీ గత ఐదేళ్లకాలంలో నియోజకవర్గంలో రూ.3,400 కోట్ల రుపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఎమ్మెల్యేకేతిరెడ్డి మాత్రం ప్రజల రక్తాన్ని పీల్చిరూ.4వేల కోట్లు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే సిట్ ఏర్పాటు చేసి కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. గుడ్‌మార్నింగ్‌ను ఎమ్మెల్యే కబ్జా మార్నింగ్‌గా మార్చారన్నారు. ధర్మవరంలో కొత్తఇళ్ల నిర్మాణం, స్థలాల రిజిస్ట్రేషన్, వాహనాల కొనుగోలు చేసినా ఆయనకు కప్పం కట్టాల్సి రావడం దురదృష్టకరమన్నారు. వైసీపీ కార్యకర్తలు కేతిరెడ్డిని చిత్తుచిత్తుగా ఓడిచేందుకు తనకు మద్దతు పలుకుతున్నారని, చాలా మంది కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ విజయానికి కృషిచేస్తామంటున్నారన్నారు.

ధర్మవరం ప్రజలకు నాలుగు హామీలు

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణకు ధర్మవరం ప్రజలకు నాలుగు హామీలిచ్చారు. ఆ హామీలను 2024-29లో నెరవేర్చిన తరువాతే మళ్లీ 2029లో ఓటు అడిగేందుకు ప్రజల ముందుకు వెళ్తానన్నారు. గతంలో ధర్మవరాన్ని సస్యశ్యామలం చేసేందుకు హంద్రీనీవా ద్వారా సాగు, తాగు నీటిని తీసుకువస్తానన్నారు. గతంలోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానన్నారు. సకాలంలో పనులు పూర్తి కాలేదన్నారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ కార్యక్రమాన్ని అడ్డుకోవడం జరిగిందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత క్లస్టర్‌ను ఏర్పాటుచేసి పదివేల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తానన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వెంటనే మెడికల్ కాలేజ్ నిర్మాణం చేపడ్తామన్నారు. నియోజవర్గానికి సోలార్‌ప్రాజెక్టు కూడా ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని గోనుగుంట్ల నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు డిష్‌రాజు, తుంపర్తిపరమేశ్, బోడగలగిరిధర్, దుస్సాక్రిష్ణ, నారాయణస్వామి, దేవేంద్రనాథ్‌రెడ్డి, గొట్లూరుచంద్ర, రాప్తాటిరాము పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల


పరిటాల శ్రీరామ్‌కు సంఘీభావం తెలుపుతున్న వాల్మీకి నాయకులు

పరిటాల శ్రీరామ్ యాత్రకు సంఘీభావం

అనంతపురంరూరల్,జనవరి 7: తెలుగుదేశం పార్టీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ చేపట్టిన ప్రజాచైతన్య యాత్రకు మండలంలోని వాల్మీకులు సంఘీభావం తెలిపారు. ఆదివారం ధర్మవరంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో వారు పరిటాల శ్రీరామ్‌ను కలసి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు రమణ, అక్కులప్ప, నాయకులు తిమ్మప్ప, వెంకటరాముడు, టపాల రాజేంద్ర, బాలకృష్ణ, మురళీకృష్ణ, నరేష్, సాకే బ్రహ్మ పాల్గొన్నారు. బీసీ సెల్ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి కక్కలపల్లి నారాయణస్వామి సంఘీభావం తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న సిమెంట్ పోలన్న

అనంతపురం అర్బన్, జనవరి 7: అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వడ్డెర సామాజికవర్గానికి చెందిన లక్ష్మీనారాయణకు వడ్డెర్ల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిమెంట్ పోలన్న ఆదివారంపరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పుల్లన్న, కొండన్న ఉన్నారు. లక్ష్మీనారాయణ సత్యసాయి జిల్లా ఓడీసీ మండలం వేమారెడ్డిపల్లి వాసి.

పద్మశాలి సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జింకా సూర్యనారాయణ

అనంతపురం అర్బన్, జనవరి 7: స్థానిక కమలానగర్‌లో పద్మశాలి సంఘం జిల్లా కార్యాలయాన్ని అనంతపురం సంఘం జిల్లా అధ్యక్షుడు జింకా సూర్య నారాయణ ఆదివారం ప్రారంభించారు. పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధికి ఈ సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు రవీంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, నాయకులు రాజశేఖర్, యుగంధర్, శ్రీనివాసులు, రంగయ్య, నరసింహులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న కేఎం జకీవుల్లా

అనంతపురం అర్బన్, జనవరి 7: టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు కేఎం జకీవుల్లా స్థానిక రహమత్ ఫంక్షన్ హాల్‌లో పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో ఒక్కో డివిజన్‌లో 100 నుంచి 500 దుప్పట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయల్ మురళీ, కృష్ణకుమార్, వెంకటప్ప, మణికంఠ బాబు, చెక్కా నాగేంద్ర, మోహన్‌కుమార్, జయరాం, లక్ష్మీనాయుడమ్మ పాల్గొన్నారు.

దండు శ్రీనివాసులుకు సన్మానం



శింగనమల జనవరి 7: అనంతపురంలో ఆదివారం నిర్వహించిన బలిజ కులస్థుల ఆత్మీయ సమావేశంలో ఆ సంఘం నాయకుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇందులో ఆ సంఘం అధ్యక్షుడు సంజీవ రాయుడు, నాయకులు వెన్నెలకృష్ణ, దాసరి గంగాధర్ వెంకట రాముడు, రాము, బాబు, హేమంత్, ప్రకాశ్, సతీష్ సోము పాల్గొన్నారు. ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జనసేన రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర బలిజ సంఘం నాయకుడు అమంచి శ్రీనివాసులుతో దండు శ్రీనివాసులు భేటీ అయ్యారు.

ఎస్ఎస్‌బీఎన్ అధ్యాపకులకు పురస్కారాలు


పురస్కారాలు అందుకుంటున్న ఫిరోజ్, ఓబిరెడ్డి

అనంతపురం సెంట్రల్, జనవరి 7: ఎస్ఎస్‌బీఎన్ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులకు శతాధిక గ్రంథకర్త పడాల రామారావు పురస్కారాలు దక్కాయి. పురస్కారాలకు ఎంపికైన డాక్టర్ నల్ల ఓబిరెడ్డి, వాదులపల్లి ఫిరోజ్‌కు కేంద్ర సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, శివప్రసాద్, పడాల వీరభద్రరావు పురస్కారాలను ఆదివారం ఆ కళాశాలలో అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, పలువురు కవులు వారిని అభినందించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

అనంతపురంరూరల్, జనవరి 7: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ చంద్రకళ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బహిరంగ ప్రజా సదస్సును ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు.

ప్రకాష్... నీ డ్రామాలు ఆపు..!

ఇంతకాలమూ ప్రజాసమస్యలు గుర్తుకురాలేదా..? : మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజం


కుర్లపల్లిలో కరపత్రాలు పంచుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

ధర్మవరంరూరల్, జనవరి 7: ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి గ్రామాల్లో కొత్తతరహా అబద్ధాలతో డ్రామాలు తెరలేపాడని మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. అతను ఇకనైనా ఆ డ్రామాలు ఆపాలని, వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. ఆదివారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కనగానపల్లి మండలంలోని కుర్లపల్లి, ఎగువతండా, దిగువ తండా, దాదులూరు గ్రామాల్లో ఆమె పర్యటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం పరిటాల సునీత మాట్లాడుతూ.. ఆత్మకూరు, అనంతపురం రూరల్ పరిధిలో చాలారోజులుగా తాగునీటి సమస్య ఉందని, అధికారంలోకి వస్తానే సమస్యను పరిష్కారిస్తామని ప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇన్నేళ్లుగా పట్టించుకోకుండా ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని, కొన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నట్లు డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. రాజధాని అమరావతి ప్రాంతం నుంచి రహస్యంగా తాగునీటి పైపులను తరలిస్తు న్నారని, అక్కడి రైతుల ఆందోళన చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. అక్కడి నుంచి పైపులను రాప్తాడుకు తీసుకు వచ్చి ఏదో గొప్పలు చేసినట్టు షోలు చేస్తున్నారని విమర్శలు చేశారు. ఓవైపు రాష్ట్రానికి రాజధాని లేకుండా సీఎం జగన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తే ఇప్పుడు ఆ ప్రాంతం నుంచి పైపులు తీసుకు వచ్చి ప్రకాష్ రెడ్డి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు దీనిపై కచ్చితంగా వాస్తవాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.


జంబులదిన్నెలో టీడీపీ నాయకుల ప్రచారం

కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, తలారి రాజప్ప, సుధాకర్ చౌదరి, ముకుంద నాయుడు, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, పూజారి రాజాకృష్ణ, బిల్లే దామోదర్, కుర్లపల్లి చంద్ర, బాలు నాయక్, లింగమయ్య, ఓబిలేసు, కేశవ, ప్రసాద్, వెంకటరాముడు, నరేం ద్రరెడ్డి, ఆదెప్ప, నరసింహులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం జంబులదిన్నెలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతు వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆవుల శ్రీనివాసులు, రాంభూపాల్‌రెడ్డి, నరేష్, పుల్లన్న పాల్గొన్నారు.

జగన్‌రెడ్డీ.. హామీని నిలుపుకో..!

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతానని ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకోవాలని ఏపీ రజక అభివృద్ధి సంస్థ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కమలానగర్‌లోని రజక అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఈనెల 28న నిర్వహించే రజక మహాసభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసిన వారు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రజకులకు మూడు ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు ఇచ్చి రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టి, రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. రజకులకు వృత్తి రీత్యా సహకరిస్తూ, ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇవ్వాల న్నారు. రజకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న అనంతపురంలో నిర్వహించే భారీ మహాసభకు రజకులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రజక అభివృద్ధి సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ పార్వతి, సెక్రటరీ జనరల్ కమ్మన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణస్వామి, రంగనాథ్, కోశాధికారి ప్రభాకర్, నగర అధ్యక్షుడు పుల్లన్న, పెద్దన్న, సాయిప్రసాద్, శివ పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఇళ్లు ఎక్కడ కట్టించారో.. ఎమ్మెల్యే చెప్పాలి..

జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత


పెండ్యాల శ్రీలతకు సమస్యలు వివరిస్తున్న బిందెల కాలనీ వాసులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7: 'ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి.. రూ. 503 కోట్లతో ఇంటి స్థలాలిచ్చి ఇంటి నిర్మాణాలు చేపట్టామన్నావు... అవెక్కడిచ్చారో చెప్పాలి. పక్కా గృహాలు నిర్మిస్తామని చెప్పి మీరు మోసం చేశారు.' అని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. ఆదివారం ఆమె చేపట్టిన మహిళలతో మాటామంతి కార్యక్రమం రెండో రోజు బిందెలకాలనీలో సాగింది. ఈ సందర్భంగా పెండ్యాల శ్రీలత మాట్లాడుతూ... బిందెల కాలనీలో చాలా మంది నిరుపేద ప్రజలు జీవిస్తున్నారని, వారికి కనీస సదుపాయాల్లో ఒక్కటైన గృహ నిర్మాణం వైసీపీ ప్రభుత్వం మరచిందని మండిపడ్డారు. కాలనీలో ప్రాథమిక పాఠశాల లేక విద్యార్థులు చదువుకు దూరమవుతు న్నారన్నారు. జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే... 2వ డివిజన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఆమె వెంట ఆ పార్టీ వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంగన్‌వాడీలకు సంఘీభావం

అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు జనసేన పార్టీ తరుపున పెండ్యాల శ్రీలత సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెను అణచివేయాలనే ఉద్దేశంతో జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం ఓ నియంత చర్య అని మండిపడ్డారు. ఇక రెండు నెలలు ఆగితే వైసీపీ ప్రభుత్వాన్ని, జగన్‌రెడ్డిని శాశ్వతంగా ఇంటికి పంపుదామన్నారు. అంగన్‌వాడీల న్యాయబద్ధమైన సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయడం తదితర డిమాండ్ల అమలుకు జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో మంత్రి ఉషా శ్రీచరణ్ అంగన్‌వాడీలు 27 రోజుల నుంచి దీక్ష చేస్తుంటే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా వాసి అయి ఉండి తన రాజకీయ భవిష్యత్తు కోసం స్వార్థంగా ఆలోచించడం సరికాదన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

బుక్కరాయసముద్రం: జిల్లాలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా సీఆర్టీలు బోధించాలని ఎస్ఎస్ఏ పీఓ వరప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో జిల్లాలోని కేజీబీవీ సీఆర్టీలకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది పదో తరగతి పరీక్షలలో జిల్లా చివరి స్థానంలో ఉందని, ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమం లో జీసీడీఓ మహేశ్వరీ, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, సీఎంఓ గోపాల్, ఏపీఓ నారాయణస్వామి, ఎస్‌ఓ నాగవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వం తీరు సిగ్గుచేటు

అనంతపురం విద్య: ఉద్యోగులపై వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటుగా ఉందంటూ... సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విజయ్ మండిపడ్డారు. చలో విజయవాడ తర్వాత సమ్మెలో భా గంగా ఆదివారం 19వ రోజూ కలెక్టరేట్ వద్ద ఆందోళన కొనసాగించారు. విజయ్ మాట్లాడుతూ.... సమగ్రశిక్ష ఉద్యోగులు 19 రోజులుగా సమ్మె చేస్తున్నా జగన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం శోచ నీయమన్నారు. ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, బెదిరించడం మినహా సమస్యలు పరిష్కరించే ఆలోచనలు ప్రభుత్వానికి లేవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్వీ నాయుడు, నాయకులు నవీన్, ఓబులేసు, రాము, అంబరీష్ పాల్గొన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

అనంతపురంరూరల్, జనవరి 7: మండలంలోని పాపంపేట పంచాయతీ ద్వారక విలాస్ రోడ్డులోని శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం తొమ్మిదవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఉదయం ఏడు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు మధుస్వామి తెలిపారు. స్వామివారికి శతరుద్రయాగం, అన్నాభిషేకం నిర్వహిస్తావని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పశువుల సంత ఆదాయం రూ.4.26 లక్షలు

అనంతపురంరూరల్,జనవరి 7: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.4,26,420 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,41,720, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,84,700 ఆదాయం వచ్చిందన్నారు.

2634 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్ : ఉమ్మడి అనంత జిల్లాకు 2,634 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిని రిటైల్ డీలర్లు, ఆర్బీకేలకు సరఫరా చేస్తామన్నారు.

సుబ్రహ్మణేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆత్మకూరు : మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పాలాభిషేకం, పంచామృత అభిషేకాలు, అలంకరణ, ఆకుపూజ, ప్రత్యేక అర్చన మహామంగళ హారతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ఆత్మకూరు, జనవరి 7 : ఆత్మకూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1993-1994లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అలనాటి ఉపాధ్యాయులు వెంకటేసు, రామాంజనేయులరెడ్డి, సాయినాథ్, వెంకటేశ్వరులు, సావిత్రమ్మ, తిక్కస్వామి, ఎం వెంకటేసులు ఘనంగా సన్మానించారు.

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఉన్నతపాఠశాలలో (1996-2000 బ్యాచ్) 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. అలనాటి ఉపాధ్యాయులను బస్టాండ్ సర్కిల్ నుంచి పాఠశాలకు వరకూ ఊరేగింపుగా తీసుకొచ్చారు. నాటి గురువులు ఆదినారాయణరెడ్డి, అశ్వర్థనారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, సరస్వతి, రాజశేఖర్, పీఈటీ ఓబిలేశులను సత్కరించారు. తోటి విద్యార్థిని మీనాక్షి భర్తను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు.



ఆత్మకూరు, సీకేపల్లిలో నాటి గురువులతో పూర్వవిద్యార్థులు


సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు

అనంతపురం కల్చరల్, జనవరి 7: ఆదర్శనగర్ శివాలయం ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ చేశారు. శివాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం భక్తిగీతాలు ఆలపిస్తూ, భజనలు చేస్తూ భక్తులు ఇంటింటికీ తిరిగి అక్షింతలను పంపిణీ చేశారు. ఊరేగింపు హౌసింగ్‌బోర్డు అభయాంజనేయస్వామి ఆలయం వరకు సాగింది. అనంతరం ఆలయంలో ఓం సంగీత నృత్యశిక్షణాలయం ఆధ్వర్యంలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో చిన్మయా మిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి, నాట్యాచార్యురాలు కౌసల్య, బీజేపీ నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, చిరంజీవిరెడ్డి, అమర్నాథ్ పాల్గొన్నారు.

జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములుకు సత్కారం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7: బలిజల ఆత్మీయ కలయిక సమావేశానికి హాజరైన జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములును ఆ పార్టీ జిల్లా నేతలు, టీడీపీ నాయకులు, బలిజ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో టీడీపీ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్, నాయకులు పత్తి చంద్రశేఖర్, రంగా రాయ్ మర్యాదపూర్వకంగా సత్కరించారు. బలిజ సంఘం నాయకులు కాయగూరల లక్ష్మీపతి ఆమంచి స్వాములును తన నివాసంలో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెన్నెలకృష్ణ, రంగా, రంగనాయకులు, నాగభూషణం, రొళ్ల భాస్కర్, గవ్వల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లివర్ వ్యాధి బాధితుడికి అండ


ఆర్థికసాయం అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి7 : నగరానికి చెందిని తిప్పేస్వామి లివర్ వ్యాధిగ్రస్తుడు. అతని ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం రూ. 4 లక్షలను అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆదివారం అందజేశారు. అదే విధంగా సీఎం ఫండ్ తరుపున రూ. 5 లక్షలు రావడంతో అతన్ని హైదరాబాద్ గ్లోబల్ ఆస్పత్రికి పంపినట్లు ఆయన తెలిపారు.

కొనసాగిన ఏపీఎల్ మ్యాచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7: స్థానిక అనంత క్రీడాగ్రామంలో సీనియర్ ఏపీఎల్ టీ-20 క్రికెట్ పోటీలు రెండో రోజైన ఆదివారమూ కొనసాగాయి. మొదటి మ్యాచ్‌లో గుంతకల్లు స్టార్ లెవెన్, పెనుకొండ జట్ల మధ్య తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన గుంతకల్లు నిర్ణీత 20 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన పెనుకొండ 18.4ఓవర్లలో 113పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. మరో మ్యాచ్‌లో మెడికల్ లెవెన్, అనంత రైజింగ్ స్టార్స్ జట్లు తలపడగా... మెడికల్ లెవెన్ 15 ఓవర్లలో 68 పరుగులకు ఆలౌట్ అయ్యింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన అనంత రైజింగ్ స్టార్స్ 6.2 ఓవర్లలో అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో గుంతకల్లు, అనంత రైజింగ్ స్టార్ జట్లు విజయం సాధించాయి. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, మధు ఆచారి ఉత్తమ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పాండురంగస్వామి నిజపాద దర్శనం


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

అనంతపురం కల్చరల్, జనవరి 7: మార్గశిరమాస ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివార్ల మూలవిరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

'అకడమిక్ కన్సల్టెంట్లకు నెల వేతనమివ్వాలి'

అనంతపురం సెంట్రల్, జనవరి 7: ఎస్కేయూలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్‌లకు జీఓ నెం.110 మేరకు నెల వేతనం ఇచ్చేలా ప్రభుత్వంలో మాట్లాడాలని ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి వారు కోరారు. ఆదివారం ఎమ్మెల్యేలకు వారు వినతి పత్రాలు అందజేశారు. అకడమిక్ కన్సల్టెంట్స్ వీరరాజు, సయ్యద్ హుస్సేన్, జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎస్కేయూలో 80 మంది అకడమిక్ కన్సల్టెంట్స్‌గా పనిచేస్తున్నారని, పనిగంటల ఆధారంగా పారితోషికం ఇస్తున్నారని అన్నారు. తమకు నెల వేతనం చెల్లించేలా కృషిచేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, ఆదిశేఖర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ముత్యాలు, రాజు, నాగేంద్ర, గురుమూర్తి పాల్గొన్నారు.

జీఓ నంబర్-2 ప్రతుల దహనం


ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

రామగిరి, జనవరి 7: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరింది. ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మా జీఓ - 2 ప్రతులను అంగన్‌వాడీలు దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. 27 రోజులుగా తాము సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

లారీలు ఢీకొని డ్రైవర్ మృతి

శింగనమల జనవరి 7: మండలంలోని నడిమిదొడ్డి సమీపంలో రెండు లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ డ్రైవర్ మరణించాడు. మండలంలోని పెద్దవడుగూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సాకే వెంకటరాముడు (50). ఆదివారం క్లీనర్ రామాంజినేయులుతో కలిసి తాడిపత్రి నుంచి ధర్మవరానికి లారీలో బయలుదేరారు. నడిమిదొడ్డి సమీపంలో నార్పల నుంచి తాడిపత్రి వెళ్తున్న మరో లారీ వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటరాముడిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మరణించాడు. శింగనమల ఎస్ఐ కేసు దర్యాప్తు చేపట్టారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


నాగముని (ఫైల్)

బుక్కరాయసముద్రం : గుర్తుతెలియని వాహనం ఢీ కొని నార్పల మండలం వెంక టాంపల్లి గ్రామానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు నాగముని (47) మరణించాడు. ఆదివారం బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి గ్రామంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయానికి నాగముని అతని స్నేహితుడు వెంకటరాముడు బైక్‌లో వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా.. కొర్రపాడు గ్రామం వద్ద వీరి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో నాగముని అక్కడిక్కడే మృతి చెందాడు. వెంకటరాముడు తీవ్రంగా గాయపడ్డాడు. నాగమునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుక్కరాయసముద్రం పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు వలంటీర్ల తొలగింపు

శింగనమల: మండలంలోని వెస్టునరసాపురం సచివాలయం పరిధిలో విధులకు సక్రమంగా హాజరుకావడం లేదంటూ ముగ్గురు వలంటీర్లకు కనీసం నోటీస్ ఇవ్వకుండా అధికారులు తొలగించారు. వారిలో వెస్టునరసాపుం గ్రామా నికి చెందిన వలింటీరి దివ్యాంగురాలు లక్ష్మీదేవి, గురుగుంట్ల గ్రామానికి చెందిన దళిత కేశవనారాయణ, నాగులగుడ్డంతండకు చెందిన ఎస్టీ కుళ్లాయప్ప నాయక్ ఉన్నారు. అయితే నాలుగు నెలల నుంచి వలంటీర్లు హాజరు పట్టికను ఉన్నతాధికారులకు పంపలేదని సచివాలయ అధికారులు చెబుతున్నారు. దీనిపై బాధిత వలంటీర్లు మాట్లాడుతూ.. కనీసం తాము చేసిన తప్పును చెప్పకుండా.. ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా అన్యాయంగా తనను తొలగించారని వాపోయారు. దీనిపై తాము కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

భూమి హక్కు చట్టంతో నష్టం: సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు, జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న భూ యాజమాన్య హక్కుల చట్టం పేద రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో భూ యాజమాన్య హక్కుల చట్టంపై వివిధ పార్టీలచే రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జగదీష్ మాట్లాడుతూ పేదల భూమిల్ని కబ్జా చేసే దురుద్దేశంతోనే వైసీపీ పెద్దలు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తేవాలని చూస్తున్నారన్నారు. ఈ చట్టం వల్ల పేద బలహీన వర్గాల రైతుల భూములకు భద్రత లేకుండా పోతుందన్నారు. నీతి అయోగ్ సివిల్ కేసుల పరిష్కారం కోసం చేసిన సిఫారసులను అడ్డం పెట్టుకుని ఈ దుర్మార్గమైన చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రైతుల నెత్తిన రుద్దాలని చూస్తోందన్నారు. భూ వివాదాలను కోర్టు పరిధిలో పరిష్కరించడం శ్రేయస్కరమన్నారు. భూ యాజమాన్య హక్కుల చట్టం రద్దు కోసం ప్రతి పక్షాలు ఏకతాటిపై నిలవాలన్నారు. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ భూయాజమాన్య హక్కుల చట్టం దుర్మార్గమైనదన్నారు. అధికారుల పర్యవేక్షణలో చేపట్టే భూ యాజమాన్య హక్కుల నిర్ధారణలో పక్షపాత వైఖరులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహేష్, ఎస్ఎండీ గౌస్, గోపీనాథ్, రామాంజినేయులు, సీపీఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, ఏఐటీయూసీ నాయకులు ఈశ్వరయ్య, బీ శ్రీనివాసులు, న్యాయవాదులు శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.


రాయదుర్గంలో జీవోను రద్దు చేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కళ్యాణదుర్గంలో కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు


గుంతకల్లులో జీఓ కాపీలను దహనం చేస్తున్న దృశ్యం


జీఓ ప్రతులను తగులబెడుతున్న అంగన్‌వాడీలు

జీవో కాపీలు దహనం

ఎస్మాను వ్యతిరేకిస్తూ జీవో నెంబర్- 2 కాపీలను పలు చోట్ల అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా అంగన్‌వాడీలు ఆదివారం దహనం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. చీకటి చట్టాలకు భయపడమన్నారు. నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించిన విషయం తెలిసిందే. దీంతో వారు మరింత ఉధృతంగా ఉద్యమాన్ని నడపడానికి సమాయత్తమవుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


బొమ్మనహాళ్‌లో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తల చేరిక


టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, జనవరి 7: మండలంలోని ఏళంజి, కానాపురం గ్రామాలకు చెందిన బీసీ, మైనార్టీలకు చెందిన 31 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు టీడీపీ మాజీ కన్వీనర్ చలపతి ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీలో చేరారు. ఏళంజి గ్రామంలో మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు వైసీపీ కార్యకర్తలకు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అరాచక వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు కలిసి వచ్చేవారందరినీ పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలన అవసరమని, వైసీపీ బాధ భరించలేకే తమ పార్టీలోకి చేరారని అన్నారు. వెంకటేశులు, బాలీసాబ్, రుద్రప్ప, చిన్న వన్నూరప్ప, లోకేష్, నజీర్‌సాబ్, గోవిందుతో పాటు బీసీ, మైనార్టీ కుటుంబాలు టీడీపీలో చేరారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం: ఉన్నం


సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నం హనుమంతరాయ చౌదరి

కళ్యాణదుర్గం, జనవరి 7: నవరత్నాలతో ఏపీ ప్రజలను మోసం చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదామంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి పిలుపునిచ్చారు. పట్టణంలోని 17వ వార్డులో ఆదివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఆర్‌జీ శివశంకర్, గోళ్ల వెంకటేశులు, రామాంజనేయులు, గాజుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అంధకారంలో రాష్ట్రం


భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

డీ.హీరేహాళ్, జనవరి 7: వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారంలో మగ్గుతోందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మండల కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు ఆధ్వర్యంలో 15 రోజులుగా కొనసాగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నూరు శాతం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇదేస్ఫూర్తితో రాబోవు రోజులలో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవడానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుష్పావతి, మాజీ జడ్పీటీసీ శ్రీరాములు, తిప్పేస్వామి, వెంకటేశు, వన్నూరుస్వామి, దేవా, సురేష్, మోహన్, విజయ్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

తాడిపత్రిటౌన్, జనవరి7: పట్టణంలోని జయనగర్‌కాలనీలో అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగనాథ్‌రెడ్డి, ఆంజనేయులు, గంగాధర్, శ్రీవాణి, నారాయణస్వామి పాల్గొని ఇంటింటికి అక్షింతలను అందించారు.

ఏపీ తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

తాడిపత్రిటౌన్, జనవరి7: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఇటీవల విశాఖలో జరిగింది. ఈ ఎన్నికలో తాడిపత్రి పట్టణానికి చెందిన సాయిబాబాను రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమించారు. కార్యవర్గం కాలపరిమితి 2024 జనవరి 6నుంచి 2028వరకు ఉంటుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిబాబా తెలిపారు.

జగన్ పాలనను భూస్థాపితం చేద్దాం: ఉమా


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, జనవరి 7: రాష్ట్ర భవిష్యత్తును సర్వనాశనం చేసిన సైకో జగన్‌రెడ్డి పాలనను భూస్థాపితం చేద్దామంటూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. శ్రీశైలం నియోజకవర్గంలో రా.. కదలి రా కార్యక్రమానికి పరిశీలకులుగా ఉమామహేశ్వరనాయుడును నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఆ నియోజకవర్గంలోని ఆత్మకూరు మండల కేంద్రంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్‌ను వేదికగా చేసుకుని సైకో జగన్‌రెడ్డి ఈ నాలుగున్నరేళ్లల్లో ఎన్నో అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలు చేశారని విమర్శించారు. అందుకోసమే నేడు ఎక్కడ చూసినా వైసీపీ పట్ల వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. టీడీపీ చేపట్టిన రా..కదలిరా...పిలుపుతో వైసీపీకి వెన్నులో వణుకు పుడుతోందన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అప్పటి గురువులతో పూర్వవిద్యార్థులు (పెద్దవడుగూరు)


కళ్యాణదుర్గంలో కలిసిన పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గం, జనవరి 7: పట్టణంలోని నార్త్ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అదే పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా తోటి మిత్రులతో ఆనాడు కలిసి చదివిన తరగతి గదిని, నాడు చేసిన అల్లర్లను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన తీరు, నాటి క్రమశిక్షణ, ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలు గురించి నెమరు వేసుకున్నారు. నాటి ఊసులు చెప్పుకుంటూ సంతోషంగా గడిపారు. విదయ నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని జేసీ ఫంక్షన్‌హాలులో ఆదివారం జడ్పీ హైస్కూల్‌లో 1995-96 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు. అనంతరం ఆర్థికంగా, అనారోగ్య సమస్యలు ఉన్న తమ తోటి పూర్వ విద్యార్థులకు సాయం అందిస్తామని పలువురు పేర్కొన్నారు.

రుక్మిణీ పాండురంగస్వామి పూజలు



బొమ్మనహాళ్, జనవరి 7: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామికి ఆదివారం ఏకాదశి సందర్భంగా విశేషపూజలు జరిగాయి. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, అష్టోత్తర నిర్వహించి పుష్పలం కరణ చేసి నైవేద్యం సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి తులసీ మాలధారణకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్, జనవరి7: పట్టణంలోని నంద్యాలరోడ్డులో ఆదివారం నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.59640లు స్వాధీనం చేసుకున్నామని ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి నలుగురిని అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశామన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

పుట్లూరు, జనవరి7: మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి అతడి నుంచి 8మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి నిందితున్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కరాటే టెస్టులో విద్యార్థుల ప్రతిభ

తాడిపత్రిటౌన్, జనవరి7: మండలంలోని గన్నెవారిపల్లిలో ఆదివారం జరిగిన కరాటే బెల్ట్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ చూపారని మార్షల్ ఆర్ట్స్ జపాన్ షిటోరియా కరాటే ట్రైనింగ్ స్కూల్ మాస్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బ్లాక్‌బెల్ట్‌లో రాగశ్రీ, భరద్వాజ్, బ్రౌన్‌బెల్ట్‌లో నలుగురు, బ్లూబెల్ట్‌లో ముగ్గురుతోపాటు మరికొంతమంది విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. వీరిని ఎంఈఓ నాగరాజు, రోటరీక్లబ్ అధ్యక్షుడు రమేష్ బాబు తదితరులు అభినందించారు.

ఘనంగా అక్కదేవతల గ్రామోత్సవం


అక్కదేవతలను ఊరేగిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, జనవరి7: పట్టణంలోని పుట్లూరు రోడ్డులో వెలసిన అక్కమహాదేవతల 23వ గ్రామోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అక్కమహాదేవతలకు, శివపార్వతులకు అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన అక్కదేవతల ఉత్సవమూర్తులతోపాటు 216 కలశములతో గ్రామోత్సవాన్ని మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్


ఆటో నడుపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

రాయదుర్గంరూరల్, జనవరి 7: అధికారంలోకి వస్తే ఏటా జనవరిలో జాబ్ కేలండర్ ఇస్తామని చెప్పిన జగన్ నిరుద్యోగులను దారుణంగా మోసం చేశాడని ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కొట్రేష్ పేర్కొన్నారు. పట్టణంలో నిరుద్యోగులతో కలిసి జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయానికి నిరసనగా ఆదివారం ఆటో తోలుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొట్రేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులుగా ఓటు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. టీచర్ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాయదుర్గం లక్ష్మీబజార్‌లో ఆటో నడుపుతూ నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి తెలిసేలా నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ తాలూకా కార్యవర్గ సభ్యుడు మురడి యోగేంద్ర, నాయకులు తరుణ్, తేజ, వంశీ రహంతుల్లా, యల్లప్ప, మధు, ప్రేమ్ చెన్నకేశవ, అంజి పాల్గొన్నారు.

రేపటి నుంచి రైల్వే ఉద్యోగుల నిరాహార దీక్ష

గుత్తి,జనవరి7: రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాలుగు రోజులు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు మజ్దూర్ యూనియన్ ఓపెన్ లైన్ బ్రాంచ్ కార్యదర్శి శేఖర్ బాబు ఆదివారం తెలిపారు. మంగళవారం స్థానిక రైల్వే బుకింగ్ కార్యాయం వద్ద నిరాహార దీక్ష చేపడతామన్నారు. ఉద్యోగులకు పాతపెన్షన్ పునరుద్ధరణ డిమాండ్‌తో సోమవారం నుంచి 11వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతామన్నారు. ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 7: కుటుంబ కలహాలతో ఆదివారం ఎరుకుల జ్యోతి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన మేరకు పట్టణంలోని బొట్టువాని వీధికి చెందిన ఎరుకల అనిత తన భర్త ఎరుకల హనుమంతు మద్యానికి బానిసై కుటుంబం గురించి పట్టించుకోవట్లేదని గొడవపడింది. మనస్తాపంతో ఇంట్లో ఉన్న చీమల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దుర్గంలో ఎలుగుబంటి కలకలం

రాయదుర్గంరూరల్, జనవరి 7: పట్టణంలో ఆదివారం తెల్లవారు జామున ఎలుగుబంటి సంచారం ఆందోళన కలిగించింది. పట్టణంలోని కోట ఏరియాలో ఉన్నటువంటి ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం పరిసరాల వీధుల్లో తెల్లవారుజామున సంచరించడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఫారెస్టు అధికారులు స్పందించి ఎలుగుబంటి సంచరించకుండా తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న జితేంద్ర గౌడ్

గుంతకల్లుటౌన్, జనవరి 7: వచ్చే ఎన్నికల్లో జగన్ రాక్షస పాలనకు చంద్రబాబు చరమగీతం పాడుతారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు టీడీపీ పిలుస్తోంది రా కదిలిరా అన్న ఎన్టీఆర్ పిలుపునకు ప్రభంజనంలా కదిలి వచ్చినట్లుగానే ప్రస్తుతం టీడీపీ, జనసేన ఇస్తున్న రా కదిలిరా పిలుపునకు అంతకు మించి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రావాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను శాశ్వతంగా రాజకీయాల్లో లేకుండా చేయాలన్నారు. జగన్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చాడన్నారు. సంక్షేమం పేరుతో జగన్ రూ. 10 ప్రజలకు ఇచ్చి వారి నుంచి రూ. 100 దోచుకుంటున్నాడన్నారు. ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు. రా కదిలిరా పేరుతో చేపట్టిన ఎన్నికల శంఖారావ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తలారి మస్తానప్ప, టీ కేశప్ప, ముక్కన్నగారి రామాంజినేయులు, శివన్న, న్యాయవాది హేమాద్రి, బీ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు


కంబదూరు-పావగడ సరిహద్దు ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం, జనవరి 7: రాబోయే ఎన్నికల దృష్ట్యా కర్ణాటక సరిహద్దు మండలాల్లో పోలీస్ నిఘా పెంచనున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం కంబదూరు- కర్ణాటక ప్రాంతమైన పావగడ సరిహద్దు ప్రాంతంలో డీఎస్పీ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం రూరల్ సీఐ నాగరాజు, ఎస్ఐ యువరాజులతో కలిసి వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చే వాహనాలను క్షుణంగా పరిశీలించి, వివరాలను సేకరించారు. కర్ణాటక మద్యం, మారణాయుధాలు, చీరలు, గిఫ్ట్‌లు, అనధికారికంగా తీసుకెళ్తున్న వస్తువులపై ప్రత్యేక నిఘా వేయనున్నట్లు పోలీసులు తెలిపారు. సివిల్, సెబ్ పోలీసులు సమన్వయంతో ఈ తనిఖీలు చేస్తామని తెలిపారు. ఆయా సరిహద్దు మండలాల ప్రజలు కూడా పోలీసులకు సహరించాలని వారు కోరారు.

ఉచిత వైద్యశిబిరం

ఉరవకొండ, జనవరి 7: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్, ఆత్మీయ ట్రస్టు, మర్క్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐ తిమ్మయ్య, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ప్రారంభించారు. ఈశిబిరంలో వైద్యులు నాగరాజు, నరేష్ ఆధ్వర్యంలో 170 మందికి, 2డీ ఎకో, ఈసీజీ, ఇతర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణయ్య, రాఘవ, లింగమయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

చెకుముకీ టాలెంట్ టెస్ట్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకీ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎర్రిస్వామి, హెచ్‌ఎం వీరన్న, ఉపాధ్యాయులు వెంకట్, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

నేడు ముస్లింల ఆత్మీయ సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

గుంతకల్లుటౌన్, జనవరి 7: పట్టణంలోని పోర్టర్ లైన్ దర్గా వద్ద ఉన్న జామియా మసీదు షాదీఖానాలో సోమవారం నిర్వహించే ముస్లింల ఆత్మీయ సదస్సుకు తరలిరావాలని టీడీపీ మైనార్టీ నాయకులు షరీఫ్, అబ్దుల్లా పేర్కొన్నారు. స్థానిక జితేంద్రగౌడ్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సమస్యలు, పరిష్కారాలు, రాజకీయ చైతన్యం అంశాలుగా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్ హాజరుకానున్నట్లు తెలిపారు. 8న ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో టీడీపీ మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, ఫ్రూట్‌మస్తాన్, ఆటోఖాజా పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికులు సమ్మె


గుత్తిలో సర్వమతస్థుల వేషధారణలతో కార్మికులు


గుంతకల్లులో సమ్మెలో పాల్గొన్న కార్మికులు

గుంతకల్లుటౌన్, జనవరి7: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారం 13వ రోజు కొనసాగింది. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ పారిశుధ్యకార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు ఆదివారం 5వ రోజు కొనసాగాయి. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు కే నరసయ్య, సూరి, జగదీష్, మస్తాన్, మల్లేష్, రంగనాయకులు, రాము, రమణ, హనుమంతు, ఏఐటీయూసీ నాయకులు జే నరసయ్య, రవి, ఈశ్వరయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వమతస్థుల వేషధారణలతో నిరసన

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం సర్వమతస్థుల వేష ధారణలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 13వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై చర్చ

కుందుర్పి, జనవరి 7: దివ్యాంగుల కోసం పనిచేస్తున్న అఖిల భారత సేవా సంస్థ అనంతపురం జిల్లా కమిటీ, కుందుర్పి కుసుమగిరి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాల కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. విద్యా, వైద్యం, ఉపాధి అనే అంశాలపై ప్రాంత సంఘటన కార్యదర్శి విజయవాడ కృష్ణ మోహన్ వివరించారు.

నెట్టికంటిని దర్శించుకున్న పీజేఆర్


ఆలయం నుంచి వెలుపలికి వస్తున్న జీవానంద రెడ్డి

గుంతకల్లుటౌన్, జనవరి7: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని టీడీపీ సీనియర్ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని శాంతినగర్‌లో నూతన గృహప్రవేశాన్ని వేదపండితులచే పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, తెలుగు రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆంజనేయస్వామికి పూజలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యమే బలం

రాయదుర్గంరూరల్, జనవరి 7: సమాజంలో ఏమైనా సాధించాలంటే ఐక్యమత్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఈశ్వర దేవాలయంలో కురుబ ఉద్యోగుల ఐక్యత సంఘం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆశయాలను నెరవేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కురుబ కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి కిష్టప్ప, రాయదుర్గం మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఎస్‌కే మల్లికార్జున, సీఐ సోమశేఖర్, వడ్రవన్నూరు సర్పంచ్ అశోక్, గలగల అశోక్, ఆదిగానిపల్లి ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.